క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సుల్తానాబాద్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శనివారం సరఫరాను నిలిపివేయనున్నట్లు డీ–2 సెక్షన్ ఏఈ ఎం.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగింపు

తెనాలిటౌన్: బాలాజీరావుపేట అయ్యప్పపురం ప్రధాన అయ్యప్ప దేవాలయంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలు కనులపండువగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామిని కల్పవృక్ష వాహనంపై ఊరేగింపు ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దుర్భ హరిబాబు స్వామి పాల్గొన్నారు.

భవన నిర్మాణ యంత్రాలు చోరీ

తెనాలిరూరల్: భవన నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలు చోరీ చేయడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మహారాష్ట్రకు చెందిన అజిత్ బకర్ తెనాలి నందులపేటలో నివసిస్తూ వెండి వ్యాపారం చేస్తున్నాడు. 2020లో రూ. 36 లక్షల విలువ చేసే భవన నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలు కొనుగోలు చేసి తెనాలి ప్రాంతానికే చెందిన రమణను డ్రైవరుగా పెట్టుకున్నాడు. ఇటీవల ఈ యంత్రాలను రమణ తీసుకువెళ్లి కనబడకుండా పోయాడని అజిత్‌బకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు జిల్లా మాదిగ ఉద్యోగుల సమావేశం

తెనాలి: గుంటూరు జిల్లా మాదిగ ఉద్యోగుల సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక కొత్తపేటలోని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నట్లు మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) జిల్లా అధ్యక్షుడు పొన్నెకంటి రవిబాబు మాదిగ, నియోజకవర్గ అధ్యక్షుడు సెట్టిపోగు లక్ష్మణ్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు మాదిగ హాజరవుతారని తెలిపారు.

10న గుంటూరులో మహాధర్నా

తెనాలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10న గుంటూరులో మహాధర్నాను నిర్వహించనున్నట్లు రైతు కూలీ సంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు, కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు రుణమాఫీ చేయాలని మహాధర్నాలో డిమాండ్ చేయనున్నట్లు సాంబశివరావు తెలిపారు. విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకుని, ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలని, 200 పనిదినాలు, రూ.600 కూలీ అమలు చేయాలని, అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టం అమలు, క్వింటాలు మిర్చికి రూ.20 వేలు నిర్ణయించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలనే తదితర డిమాండ్లతో జరిగే మహాధర్నాలో రైతాంగం పాల్గొనాలని కోరారు.

నూతక్కి అబ్రహం రచనలు తెనాలి కీర్తికి ప్రతీకలు

డీఎస్పీ జనార్దనరావు



తెనాలిటౌన్: నూతక్కి అబ్రహం రచనలు తెనాలి కీర్తికి ప్రతీకలుగా నిలుస్తాయని డీఎస్పీ జనార్దనరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో మధురకవి నూతక్కి అబ్రహం జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డీఎస్పీ జనార్దనరావు, తహసీల్దార్ గోపాలకృష్ణ పాల్గొని అబ్రహం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అబ్రహం కుమారుడు పూర్ణ ప్రజ్ఞాచారిని దుశాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత జ్యూడిషయల్ అధికారి ఉన్నం యేహేస్కేల్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు, రాష్ట్ర కన్వీనర్ కూచిపూడి మోహన్, న్యాయవాది సుద్దపల్లి మురళీధర్, యడ్లపల్లి రవికిరణ్, కొలకలూరి పాపారావు, శీలం వినయ్, సోపాటి శ్రీను, కొలకలూరి పీటర్‌పాల్ పాల్గొన్నారు.

మహిళా సాధికారత సమాజ ప్రగతికి దోహదం

తెనాలిటౌన్: మహిళా సాధికారత సమాజ ప్రగతికి దోహదపడుతుందని కఠెవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి శ్రీధర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం రూరల్ మండలం కఠెవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయినీలను దుశాలువా, పూలమాలలతో సత్కరించారు.

ఎదను కదిపే ఆలాపన

- సంగీత విద్వన్మణి చింతలపాటి మంజుల
- ప్రముఖ గాయని, ఏఎన్‌యూ సంగీత విభాగం అధిపతి
- నేడు రాష్ట్ర ప్రభుత్వ విశిష్ట మహిళా అవార్డును స్వీకరిస్తున్న సందర్భంగా...



డాక్టర్ చింతలపాటి మంజుల

తెనాలి: ఆమె గానం సంగీత మధురిమలను పంచుతుంది... ఆధ్యాత్మిక కీర్తనలు శ్రోతలను అలౌకిక ప్రపంచంలోకి తీసుకెళతాయి. పారవశ్యాన్ని కలిగిస్తాయి. ఎన్నో ఏళ్లుగా తన సంగీత విద్యతో శ్రోతలను రంజింపజేస్తూ మరెందరికో శిక్షణనిస్తున్న సంగీత విద్వన్మణి చింతలపాటి మంజుల.

రాష్ట్ర ప్రభుత్వం శనివారం మార్కాపురంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో విశిష్ట మహిళా అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆమె సంగీత ప్రస్థానం తన మాటల్లోనే...

కళల తెనాలి నా సొంతూరు కావటం నా అదృష్టం. మా తండ్రి జంధ్యాల సాంబశివశాస్త్రి పెద్ద కుమార్తెను. తండ్రి వ్యాయామ ఉపాధ్యాయుడు. ఆయన పనిచేస్తున్న తెనాలిలోని తాలూకా హైస్కూలులోనే నా చదువు సాగింది. తండ్రి స్ఫూర్తితో చిన్నప్పట్నుంచి ఆటల్లో ఫస్ట్ వచ్చాను. షటిల్, వాలీబాల్ క్రీడల్లో జిల్లాస్థాయి పోటీల్లో బహుమతులను అందుకున్నాను. అంతకన్నాముందే నాలుగేళ్ల వయసులోనే పెద్దలు నాతో వీణ పట్టించారు. ఏడోతరగతి చదువుతూ వీణ సాధన చేశాను. విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు చేశాను. పదోతరగతి తర్వాత అదే కాలేజీలో సంగీతంలో డిప్లొమా చేశాను. కృష్ణా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్లో ఏటా పాల్గొంటూ వీణలో బహుమతులను అందుకున్నాను. వివాహం తర్వాత మకాం విశాఖకు మారింది. ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ(సంగీతం), ఎంఏ తెలుగు చదివాను. డిస్టింక్షన్‌లో పాసై రెండు బంగారు పతకాలు సాధించాను.

సంగీతంలో పీహెచ్‌డీతో..

సంగీతంలో పీహెచ్‌డీలో ప్రవేశం కోసం రాసిన ప్రవేశికలో అగ్రగామిగా నిలిచాను. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ మండపాక శారద గైడ్‌గా పీహెచ్‌డీ చేశాను. '19, 20 శతాబ్దాల్లో ఉత్తరాంధ్ర సంగీతం–ఒక అధ్యయనం' అంశంపై పరిశోధన చేసి సమర్పించిన థీసిస్‌కు ఉత్తమ థీసిస్ అవార్డు లభించటం మధురానుభవం. దీనిని నా గైడ్‌కు నేనిచ్చిన కానుకగా భావిస్తాను. మరోవైపు బోధనా రంగంలో కొనసాగుతూ వచ్చాను. ఆంధ్రా యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఏడెనిమిదేళ్లు చేశాను. గాయనిగా సంగీత కచేరీలు చేస్తున్నాను. తర్వాత ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పెర్ఫార్మింగ్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగంలో చేరాను. ప్రస్తుతం ఆ విభాగ అధిపతిగా కొనసాగుతున్నాను.

సంగీతమే నా ప్రపంచం

బోధనా వృత్తిలో ఉన్నా, సంగీతమే నా ప్రపంచం. సంగీతానికి సంబంధించి బోధన, గానం రెండు కళ్లు నాకు. సంగీత కచేరీలు చేస్తున్నా. తిరుమల తిరుపతి దేవస్థానం నాదనీరాజనంలో గానం వినిపించాను. అక్కడ జరిగే సహస్ర దీపాలంకరణ సేవలో పదేళ్లనుంచి గానాలాపన చేస్తున్నాను. ఏటా ఏకాదశి ఉత్సవాలు, రామదాసు వంటి వాగ్గేయకారుల సంగీతోత్సవాల్లోనూ పాడుతున్నాను. సింహాచలం, విశాఖపట్టణం, తెనాలి, విజయవాడతో పలు ప్రసిద్ధ ఆలయాల్లో, అనేక వేదికలపై సంగీతగానం చేశాను. సంగీతాన్ని వ్యాప్తి చేయాలనే భావనతో వ్యక్తిగతంగా బాలలకు సంగీత విద్యలో బేసిక్స్‌ను నేర్పిస్తున్నాను. గురువు మార్గానే ఇప్పటి వరకు వేలాదిమందికి నేర్పించాను. సంగీతంపై నాకున్న అనురక్తితో చాలామందికి ఉచితంగానే శిక్షణనిచ్చాను. సంగీత కళాకారిణిగా ఆ కళకు నా నీరాజనం ఇది. యూనివర్సిటీలో వర్క్‌షాపులూ నిర్వహించాను. ఆవిధంగా సంగీతమే నా ప్రపంచమైంది. వ్యక్తిగతానికి వస్తే నా భర్త సుబ్రహ్మణ్యం శ్రీనివాస్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఫైనాన్స్ విభాగంలో జీఎంగా రిటైరయ్యారు. పెద్ద కుమార్తె శ్రీపాద గాయత్రి గ్రూప్–1కు ఎంపికై ఏలూరులో అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా చేస్తోంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని తను కూడా ఏలూరులో కలెక్టరు నుంచి అవార్డును స్వీకరిస్తోంది. చిన్న కుమార్తె శ్రీశ్రుతి ఫోర్డ్ కంపెనీలో డిజైన్ ఇంజినీర్.

ఆత్మస్థైర్యంతో మహిళలు పురోభివృద్ధి సాధించాలి



ర్యాలీలో డీఎస్పీ జనార్దనరావు, సీఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: మహిళలందరూ ప్రతి రంగంలోను అభివృద్ధి సాధించాలని డీఎస్పీ బి.జనార్దనరావు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక మహిళా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో త్రీ టౌన్ పోలీసులు చెంచుపేటలో మహిళలు, విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన డీఎస్పీ మాట్లాడుతూ నేటి సమాజం అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంకా కొన్ని చోట్ల స్త్రీల పై అఘాయిత్యాలు, వివక్ష కొనసాగతుండటం బాధాకరమన్నారు. పురుషులతోపాటు స్త్రీలు అన్ని రంగాలలో సత్తా చాటుతూ ముందుకు వెళుతున్నారని, పోలీస్‌స్టేషన్‌కు, న్యాయస్థానాలకు రావటం తప్పుకాదని, స్త్రీకి జరిగిన అన్యాయానికి, హక్కుల ఉల్లంఘనకు చట్టరీత్యా పోరాటం చేసేందుకు న్యాయస్థానాలకు, పోలీస్‌స్టేషన్‌కు రావాలని సూచించారు. సమాజంలో మాదక ద్రవ్యాల వాడకాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టూ టౌన్ పోలీసులు 'మహిళా మీ కోసం' ర్యాలీని నిర్వహించారు. ఐతానగర్‌లోని లింగారావు సెంటరు వద్ద ర్యాలీని సీఐ రాముల నాయక్ ప్రారంభించారు. వివిధ కూడళ్ల మీదుగా ర్యాలీ సాగగా మహిళల చట్టాల గురించి వివరించారు. ఎస్ఎస్ఎస్ఎం హైస్కూలు విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

తెనాలిటౌన్: టీబీ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నివారణ అధికారి దాసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం రూరల్ మండలం కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిస్ట్రిక్ పంచాయతీ ఆఫీసర్ బీవీ నాగసాయికుమార్, టీబీ నివారణ ఆఫీసర్ దాసరి శ్రీనివాసరావు పరిశీలించారు. వైద్యశాలలో రికార్డులను తనిఖీ చేసి మాట్లాడారు. కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్నటువంటి కుంచవరం గ్రామంలో క్షయ వ్యాధిగ్రస్తులు ఎవరులేకపోవడం మంచి పరిణామన్నారు. టీబీ ముక్త గ్రామ పంచాయతీగా కుంచవరాన్ని పరిగణించినట్లు తెలియజేశారు. క్షయ వ్యాధి నిర్మూలనకు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా టీబీ బృందం పర్యటించి ప్రజలకు అవసరమైన పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ దిలీప్, తెనాలి టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమాదేవి, సూపర్‌వైజర్ డాక్టర్ పల్లెకొండ రవికుమార్, ల్యాబ్ సూపర్‌వైజర్ లక్ష్మి పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

సినిమాపై నిరంతర పరిశోధన అవసరం

డాక్టర్ పి.దక్షిణామూర్తి



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ దక్షిణామూర్తి

తెనాలి: ప్రేక్షకులకు నిజమైన వినోదాన్ని ఉన్నత విలువలను చాటిన నాటితరం సినిమాలపై పరిశోధన నిరంతరం జరగాలని, నేటితరానికి ఆ విశేషాలను అందించాలని చైతన్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అన్నారు. ఒకనాటి ఆంధ్రుల అందాల సినీతార కాంచనమాల జీవితంపై 'తెలుగు సినిమా డ్రీమ్‌గర్ల్ కాంచనమాల' పేరుతో గుంటూరుకు చెందిన చరిత్ర పరిశోధకుడు పారా అశోక్‌కుమార్ సంపాదకత్వంలో తీసుకొచ్చిన మోనోగ్రాఫ్ పుస్తకావిష్కరణ శుక్రవారం సాయంత్రం ఆమె స్వస్థలమైన తెనాలిలో జరిగింది. భారత సాంస్కృతిక సహకార స్నేహసంఘం (ఇస్కఫ్) కార్యాలయంలో ఏర్పాటైన సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ దక్షిణామూర్తి మాట్లాడుతూ, ఉత్తమ సినిమాలను ప్రోత్సహించాలనే భావనతో క్లాసికల్ ఫిలిం సొసైటీతో చేసిన కృషిని వెల్లడించారు. చివరిరోజుల్లో కాంచనమాలను వైద్య సలహాలను ఇచ్చినట్టు చెప్పారు. ఆమె జీవితాన్ని పరిశోధించి చక్కని పుస్తకంగా తీసుకొచ్చిన అశోక్‌కుమార్‌ను అభినందించారు. ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ బాలీవుడ్ నటీమణి హేమమాలినికన్నా ముందే తెలుగునాట డ్రీమ్‌గర్ల్‌గా కాంచనమాల వెలుగొందారని చెప్పారు. ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి మాట్లాడుతూ కాంచనమాలతోనే తెనాలికి ఆంధ్రా ప్యారిస్‌గా పేరొచ్చిందని చెప్పారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ పాత సాహిత్యాన్ని వివిధ అంశాలకు సంబంధించిన లక్షలాది పుస్తకాలను డిజిటలైజ్ చేస్తూ భావితరాలకు పదిలం చేస్తున్న మనసు ఫౌండేషన్ కృషిని, అందుకు అశోక్‌కుమార్ తోడ్పాటును ప్రశంసించారు. సంపాదకుడు పారా అశోక్‌కుమార్ కాంచనమాల పుస్తకం తరహాలోనే మరిన్ని మోనోగ్రాఫ్‌లను సిరీస్‌లా తీసుకొస్తానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ, డాక్టర్ కె.రామరాజు, లలితానంద ప్రసాద్, యడ్లపాటి వెంకటేశ్వరరావు, జుగాష్‌విలి, జీఎస్ నాగేశ్వరరావు, కొండముది రమేష్‌బాబు, ఆరాధ్యుల కన్న, అన్నపూర్ణ, లక్కరాజు లక్ష్మణరావు, లక్ష్మణశాస్త్రి, చందు సూర్య, కన్నెగంటి మధు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



తెనాలిరూరల్: రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని తెనాలి అంబేడ్కర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 ప్రకారం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పదేళ్ల పాటు సేవలందించి, 2024–25 విద్యా సంవత్సరం నుంచి ఆంధ్ర ప్రదేశ్‌లో అడ్మిషన్లు తీసుకోవడం నిలిపివేసింది. అంబేడ్కర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సాయంత్రం కళాశాల ఎదుట నినాదాలు చేశారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లను నిలిపివేయడం ద్వారా రాష్ట్రంలో ఏడాదికి దాదాపు 50 వేలకు పైగా విద్యార్థులు తక్కువ ఫీజులకే చదువుకునే డిగ్రీ, పీజీ విద్యను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలో ఓపెన్ యూనివర్సిటీని ఆరంభించి విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆటోడ్రైవర్‌పై హత్యాయత్నం



తెనాలిరూరల్: ఆటో డ్రైవర్‌పై పదునైన వస్తువుతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి అతడి వద్ద ఉన్న నగదును గుర్తు తెలియని వ్యక్తి దోచుకెళ్లాడు. ఈ ఘటన తెనాలి మండలం కఠెవరం నుండి కోపల్లెకు వెళ్లే మార్గంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. పట్టణ మారీస్‌పేట సీఎం కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ అశోక్‌కుమార్ డ్వాక్రా డబ్బులు కట్టేందుకు సొంత ఆటోలో కఠెవరం నుంచి కోపల్లె వెళుతున్నాడు. గుర్తు తెలియని వ్యక్తి ఆటోను ఆపగా బాడుగ కోసం అయ్యుంటుందని ఆటోను ఆపాడు. సదరు వ్యక్తి అశోక్‌కుమార్‌పై దాడికి చేయడమే కాకుండా జేబులో నుంచి బ్లేడ్ వంటి పదునైన వస్తువు తీసి గొంతు, చేతులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అశోక్ జేబులో ఉన్న రూ.11 వేలు దోచుకెళ్లాడు. గొంతు మీద తీవ్ర గాయంతో షాక్‌కు గురైన బాధితుడు తేరుకున్నాక తన స్నేహితుడికి ఫోన్ చేసి విషయం తెలుపగా, అతని సాయంతో తెనాలి జిల్లా వైద్యశాలలో చేరాడు. రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, బాధితుడి నుంచి వైద్యశాలలో వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దారి దోపిడీ డ్రామానా!

తెనాలిరూరల్: తెనాలి మండలం కఠెవరం నుంచి కోపల్లె వెళ్లే డొంక రోడ్డులో గురువారం రాత్రి పొద్దుపోయాక ఆటోడ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి, నగదు దోచుకెళ్లిన ఘటన జరిగింది. అయితే ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు ఘటనలో రెండో వ్యక్తి ప్రమేయం లేదన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆటోడ్రైవర్ అశోక్‌కుమార్ అప్పుల బాధతో తనకు తానే గాయపర్చుకున్నాడన్న అనుమానం పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. దర్యాప్తులో మరిన్ని వివరాలు తెలుస్తాయని రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

స్వయం ఉపాధి శిక్షణతో ఆర్థిక స్వావలంబన



సర్టిఫికెట్లను అందజేస్తున్న రాజకుమారి, అధికారులు

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్ల ప్రదానం చేశారు. బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ భవనంలో సాయంత్రం ఏర్పాటైన సభకు సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద అధ్యక్షత వహించారు. మహిళా సాధికారతలో భాగంగా టైలరింగ్, శారీ పెయింటింగ్, వంట, ప్రాథమిక చికిత్సలో మహిళలకు ఉచితంగా ఇక్కడ శిక్షణనిచ్చారు. వీరిలో టైలరింగ్, శారీపెయింటింగ్‌లో ఆరునెలల శిక్షణ పూర్తిచేసుకున్న 50 మంది మహిళలకు సర్టిఫికెట్లను మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో అత్తోట దీప్తి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలను వీరు అభినందిస్తూ, స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబనను పొందాలని సూచించారు. డీ3 శారద సర్వీస్ సొసైటీని సేవలను ప్రశంసించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ గుత్తా వెంకటరత్నం, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సూర్యప్రకాశరావు, కోశాధికారి హృదయరాజు, డీవీ సోమయ్యశాస్త్రి పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో మెరుగైన అవకాశాలు



ప్రొఫెసర్ విజయ్ కొత్రాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ

తెనాలిఅర్బన్: ఫార్మా రంగం ఎంతో విశిష్టమైనదని, ఆ రంగాన్ని ఎంచుకున్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని మలేషియాలోని క్విస్ట్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ కొత్రా పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలలో బీ-ఫార్మసీ విద్యార్థులు ఫ్రెషర్స్, ఫేర్‌వెల్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో అనేక ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. సీనియర్, జూనియర్ల మధ్య హెచ్చు తగ్గులు లేకుండా ఆదర్శవంతంగా ఉండాలని సూచించారు. కళాశాలలోని లైబరీని ఎక్కువగా ఉపయోగించుకుంటూ కరెంట్ ఎఫైర్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ముందుగా కళాశాల వ్యవస్థాపకులు అన్నాబత్తుని సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


రేపు ఉచిత మెగా వైద్యశిబిరం



కరపత్రాన్ని ఆవిష్కరించిన సొసైటీ నేతలు

తెనాలి: పట్టణానికి చెందిన ది పద్మశాలి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ముత్యంశెట్టిపాలెంలోని సొసైటీ కల్యాణమండపంలో నిర్వహించనున్న మెగా వైద్యశిబిరం కరపత్రాన్ని నిర్వాహకులు శుక్రవారం ఆవిష్కరించారు. విజయవాడ, గుంటూరు, తెనాలికి చెందిన ప్రముఖ స్పెషలిస్టు డాక్టర్లతో చిన్న పిల్లలు, గర్భిణులు, కీళ్లనొప్పులు, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలకు రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు వైద్యులకు అభినందనతో పాటు తెనాలికి చెందిన పేదల డాక్టరు, ఎంపీఎంహెచ్ఎస్‌గా ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ గుత్తి సుబ్రహ్మణ్యాన్ని సత్కరించి 'వైద్యసేవారత్న' బిరుదును ప్రదానం చేయనున్నట్లు వివరించారు. డాక్టర్ పురుషోత్తమరావుతో పాటు సొసైటీ కార్యవర్గ సభ్యులు జొన్నాదుల నరసింహారావు, గంజి శివభుజంగ ప్రభాకరరావు, దివి పురుషోత్తమ్, జొన్నాదుల మహేష్, తుమ్మలచర్ల వెంకట కృష్ణారావు, దివి హేమంత్‌కుమార్, రాచాబత్తుని వెంకట శివప్రసాద్, కటకం వెంకట ప్రసాద్, దామర్ల మదనమోహనరావు, కటకం శేషగిరిరావు పాల్గొన్నారు.

రుణగ్రహీతలైన రైతులకు కష్టాలు



పెదగాదెలవర్రు(తెనాలి): తెనాలి సమీపంలోని బాపట్ల జిల్లా చుండూరు మండల గ్రామం పెదగాదెలవర్రులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో రుణాలు తీసుకున్న రైతులకు అగమ్య గోచర పరిస్థితి ఏర్పడింది. సొసైటీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివారెడ్డి అనారోగ్యం కారణంగా నెలరోజులు సెలవుపై వెళ్లారు. స్వస్థత చేకూరని పరిస్థితిలో మరో నెల రోజులు సెలవును పొడిగించారు. సొసైటీలో సూపర్‌వైజర్ కూడా అందుబాటులో లేరు. నెలాఖరుతో 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియనున్న తరుణంలో సొసైటీలో కీలక అధికారులు లేకపోవటంతో రైతులకు రుణాలకు చెల్లించటం ప్రశ్నార్థకంగా మారింది. పెదగాదెలవర్రు పేరుతో(డీఆర్ నెం.340)గల సొసైటీ వాస్తవంగా సమీపంలోని చినగాదెలవర్రులో ఉంది. ఈ సొసైటీ నుంచి రైతుల బకాయిలు రూ.16 కోట్ల వరకు ఉన్నాయి. దీర్ఘకాలిక రుణాలు రూ.6 కోట్లు, పంట రుణాలు రూ.4.16 కోట్లు, ఓల్డ్ సీసీ రుణాలు 1.20 కోట్లు, స్వల్పకాలిక రుణాలు రూ.4.70 కోట్ల చొప్పున రైతులు తీసుకున్నారు. హెచ్చుశాతం రుణాలను మార్చి నెలాఖరులోగా సొసైటీకి తిరిగి చెల్లించాల్సి ఉంది. బకాయిలు వసూలు చేసుకుని రసీదులు ఇవ్వాల్సిన సూపర్‌వైజర్ లేకపోవటం, కార్యదర్శి సెలవులో ఉండటంతో రుణాలను ఎవరికి జమ చేయాలో రైతులకు అంతుపట్టని సమస్యగా మారింది. సెలవు పెట్టిన కార్యదర్శి స్థానంలో వేరొకరికి ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మార్చి నెలాఖరులోగా రుణాలు జమ చేయకపోతే నిబంధనల ప్రకారం తమపై అధిక వడ్డీల భారం పడుతుందని ఆందోళన చెందుతున్నారు.

ఓవర్ హెడ్ ట్యాంక్ పరిశీలన



తెనాలిఅర్బన్: పట్టణంలో రక్షిత తాగునీరు సక్రమంగా సరఫరా జరిగే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. వీఎస్సార్ కళాశాల రోడ్డులోని రక్షిత తాగునీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుక్రవారం పరిశీలించారు. నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. అనంతరం బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్టు యార్డు, కుక్కల శస్త్ర చికిత్సాలయం, పూలే కాలనీలోని ఎస్టీపీ ప్లాంట్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, డీఈ శ్రీనివాసరావు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



తెనాలిఅర్బన్: నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద వచ్చిన రూ.1,42,059 విలువైన చెక్కులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ నిధుల ద్వారా ప్రజలకు అత్యవసర ఆరోగ్య సాయం చేయడం జరుగుతుందన్నారు. పేద ప్రజలకు మన ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పరంజ్యోతి భగవాన్ జన్మదిన వేడుకలు

తెనాలిరూరల్: మండల గ్రామం బుర్రిపాలెంలోని శ్రీ సర్వదేవ పరంజ్యోతి మానవ సేవా ఆలయంలో పరంజ్యోతి భగవాన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1200 మంది భక్తులతో పాదుకాభిషేకం చేశారు. అచ్యుత దాసాజీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం మహా నివేదన, అన్నప్రసాద వితరణ చేశారు.